సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



'ఇందిరమ్మ'కు ఇసుక గండం
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. 8లో▸



వామ్మో.. ఇదేం బస్టాండ్!
మండల కేంద్రమైన ధారూరులో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. 8లో▸



విద్యకు దూరం
దౌల్తాబాద్ మండలం దావరిగూడెంలో టీచర్ల కొరత కారణంగా పూర్వ ప్రాథమిక విద్య ముందుకు సాగడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి



బిల్లులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొడంగల్: పట్టణ పరిధిలోని వ్యాపారులు ట్రేడింగ్ లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ కోరారు. గురువారం పట్టణంలోని వ్యాపారుల వద్దకు వెళ్లి లైసెన్సులను రెన్యూవల్ చేశారు. అందుకు సంబంధించిన బిల్లులను వసూలు చేశారు. ఏడాదికి ఒకసారి చిరు వ్యాపారుల నుంచి బడా వ్యాపారుల వరకు అనుమతి పత్రాలను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది భరత్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తాం
స్పీకర్ ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో అడ్వకేట్ల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బస్వరాజు, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శంకరయ్య, గోవర్దన్‌రెడ్డి, కమాల్‌రెడ్డి, శుభప్రదీప్‌పటేల్, యాదవరెడ్డి, సంపూర్ణ ఆనంద్, నాగరాజు, గోపాల్‌రెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధారూరుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాక

ధారూరు: మండల కేంద్రానికి శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ రానున్నారు. లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు అందజేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ధారూరులోని రైతు వేదికలో కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ సాజిదాబేగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న లింగ్యా నాయక్

నవాబుపేట: భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అవసరమైన వాటికి డేటా ఎంట్రీ చేయాలని, గ్రామాల వారీగా రైతుల నుంచి తీసుకున్న ప్రతి అర్జీకి సంబంధించి సాదాబైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో మార్పులు చేర్పులు, వంటి వివిధ సమస్యలను పరిశీలించి పూర్తయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరణ ధ్రువీకరణ, పుట్టినరోజు వంటి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ రాజు, రజిత రాణి పాల్గొన్నారు.

యువకుడిపై కేసు

బషీరాబాద్: బాలికను ఎత్తుకెళ్లిన యువకుడిపై బషీరాబాద్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెద్దేముల్ మండలం పాషాపూర్ తండాకు చెందిన రాథోడ్ రాహుల్ దగ్గర ఉన్న బాలికను అదుపులోకి తీసుకుని గౌతపూర్ పీఎస్‌కు తరలించారు. యువకుడిని సీఐ నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు విచారించారు. బాలికను వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌కు స్టేట్‌మెంట్ రికార్డు కోసం తరలించినట్లు ఎస్‌ఐ నుమాన్ అలీ మీడియాకు తెలిపారు.

పాలమూరు పూర్తి చేస్తాం

ప్రజల ఆకాంక్ష మేరకే ప్రభుత్వం పనిచేస్తుంది
- పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వమే 'ప్రాణహిత- చేవెళ్ల'ను రద్దు చేసింది
- జనహిత పాదయాత్రలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మీనాక్షి నటరాజన్‌కు పార్టీ జెండా అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు చిత్రంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, తదితరులు



జనహిత పాదయాత్రలో పార్టీ నేతలు

పరిగి: ప్రజల ఆకాంక్ష మేరకే కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ పనిచేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర గురువారం పరిగి మండలం రంగాపూర్ నుంచి పరిగి పట్టణం వరకు సాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిందన్నారు. రైతు భరోసా పథకం కింద 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ బిల్లును కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. దీనిపై కేంద్రంతో కొట్లాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. కేంద్రం మెడలు వంచి బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి పరిగి ప్రాంతం రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

సంక్షేమంలో మనమే ఆదర్శం

సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని పేర్కొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకే జనహిత పాదయాత్ర చేపట్టినట్లు వివరించారు. ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు. పట్టణంలో జనహిత పాదయాత్ర అట్టహాసంగా సాగింది. కిలోమీటర్ల మేర ప్రజలు బారులు తీరారు. పాదయాత్రలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పార్టీ జిల్లా, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మండల నాయ కులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పింఛన్ హామీ నిలబెట్టుకోవాలి
ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ



దివ్యాంగులతో సోమశేఖర్ మాదిగ తదితరులు

దోమ: కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన పింఛన్ హామీని నిలబెట్టుకోవాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బొంపల్లిలో ఎంఎస్‌ఎఫ్ ఏపీ అధ్యక్షుడు వై.కె.విశ్వనాథ్ మాదిగ, మండల ఉపాధ్యక్షుడు డి.వెంకటేశ్‌తో కలిసి దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 2న కొడంగల్ పట్టణంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పింఛన్ డబ్బు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ, గ్రామ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షుడు కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో భవిష్యత్తు



జ్యోతి ప్రజ్వలన చేసి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జయేశ్ రంజన్

స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్

మర్పల్లి: నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు. గురువారం మండలంలోని పట్లూర్ గ్రామంలో పవర్ మేక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధునాతన మిషనరీ, కంప్యూటర్ల వాడకం పెరుగుతున్న నేపథ్యంలో ఆ రంగాల్లో అనుభవం ఉన్న యువతకు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. పవర్ మేక్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. తమ సెంటర్‌లో వెల్డింగ్, ఫిట్టర్, ఎలక్ట్రీషన్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు, ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కోర్సుల ఆధారంగా 30 నుంచి 90 రోజుల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 8వ తరగతి పాస్ అయి ఉండి ఐటీఐ, లేదా ఇంటర్ పాస్ అండ్ ఫెయిల్ అయిన వారు శిక్షణకు అర్హులన్నారు. కార్యక్రమంలో పవర్ మేక్ ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ లక్ష్మి, పవర్ మేక్ ఫౌండేషన్ అధినేత కిషోర్ బాబు, ప్రిన్సిపాల్ విమల్ కుమార్, నందకిషోర్, ప్రభాకర్, భరత్ పురోహిత్, పట్లూర్ గ్రామస్తులు అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ వాణిజ్య ఒప్పందం ప్రమాదకరం
తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం విదేశీ వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏఎ)పై సంతకం చేయడమంటే అమెరికా సామ్రాజ్యవాద ఆదేశాలకు లొంగిపోవడమేనని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. గురువారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు శ్యామయ్య అధ్యక్షతన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు.. పరిష్కారాలు అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, పాడి, ఆహార, మార్కెట్ రంగాలకు ద్వారాలు తెరవడంతో దేశ ప్రయోజనాలు దెబ్బతింటాయని తెలిపారు. కేంద్రం తీసుకున్న చర్యలను వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షులు మహిపాల్, సతీష్, లక్ష్మయ్య, వల్యానాయక జమాలొద్దీన్, అనసూయ లక్ష్మి, రాజు, బస్వరాజు, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శోభన్

రుణ లక్ష్యాన్ని పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్

తాండూరు: వంద రోజుల ప్రణాళికలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్ సూచించారు. గురువారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, టీఎంసీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆర్పీలు, వార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోని 600 మహిళా సంఘాలకు రూ.80 కోట్ల రుణాలను ఆగస్టు నెలాఖరుగా అందించాలన్నారు. అలాగే కొత్త సంఘాలు, వీధి వ్యాపారుల సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. తాండూరు మున్సిపాలిటీకి 44 సంఘాల ఏర్పాటు చేయాలనే లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. ప్రతి సంఘంలో 5 మంది వీధి వ్యాపారుల నుంచి 20 మంది వరకు సభ్యులుగా చేర్చాలన్నారు. ఇప్పటికే 5 మంది వీధి వ్యాపారులతో 20 సంఘాలను ఏర్పాటు చేయడంపై టీఎంసీ రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు. మరో 24 సంఘాలను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. గొల్ల చెరువు ప్రాంతంలో మొక్కలను నాటాలన్నారు. పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మహిళా సంఘాల ఉత్పత్తి మేళాను మూడు రోజుల పాటు ఏర్పాటు చేయాలన్నారు.

పనుల్లో వేగం పెంచండి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచి త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సొంత ఇల్లు ఉంటే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లాకు ఇప్పటివరకు 11,785 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. 5,778 గ్రౌండింగ్ అయ్యాయని, 882 పూర్తయినట్లు పేర్కొన్నారు.

హౌసింగ్ పీడీకి ఘన వీడ్కోలు

ఉద్యోగ విరమణ పొందుతున్న హౌసింగ్ శాఖ పీడీ కృష్ణయ్యకు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కృష్ణయ్య సేవలను కలెక్టర్ కొనియాడారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటే హౌసింగ్ స్కీంను ముందుకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, హౌసింగ్ శాఖ అధికారులు ముక్రం బాబా, సయ్యద్ సాజిద్, తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తుండిపోతాయి

విధి నిర్వహణలో మనం చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న హౌసింగ్ పీడీ కృష్ణయ్యకు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, టీజీఓ సెక్రటరీ మహమ్మద్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, డీపీఓ జయసుధ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణయ్యను సన్మానిస్తున్న, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

బీసీ రిజర్వేషన్లపై డ్రామాలు

- సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్
- బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై ఆగ్రహం



తాండూరు టౌన్: బీసీ రిజర్వేషన్లను అడ్డుపెట్టుకుని రాజకీయ పార్టీలన్నీ డ్రామాలు ఆడుతున్నాయని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు పాసై, గవర్నర్ వద్ద ఆమోదం కోసం ఎదురు చూస్తోందన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ డ్రామాకు తెరతీశారన్నారు. రాష్ట్రంలో 56 శాతానికి పైగా బీసీ జనాభా ఉన్నప్పటికీ, కేవలం 29శాతం విద్య, ఉద్యోగాల్లో, 21శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు వెనకాడిన ఆ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్‌ను విమర్శిస్తోందన్నారు. బీసీ కులగణన వివరాలను, సర్వే డాటాను ప్రజలకు అందుబాటులో పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండా కాంగ్రెస్ తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలైతే ముస్లింలు లాభపడతారని బీజేపీ ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ఇలా ప్రతి రాజకీయ పార్టీ వారి స్వప్రయోజనాల కోసం వ్యవహరించకుండా, ఏకతాటిపైకి వచ్చి బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా చూడాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

బాల కార్మికులకు విముక్తి



ఆపరేషన్ ముస్కాన్ ముగింపు సమావేశంలో వెంకటేశం తదితరులు

- నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్
- 54 మంది చిన్నారుల గుర్తింపు
- జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం

తాండూరు రూరల్: ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా తాండూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న 54 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించినట్లు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం తెలిపారు. గురువారం మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, కార్మిక శాఖ, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించామన్నారు. 54 మంది బాల కార్మికులను గుర్తించామని, ఇందులో ఏడుగురు బాలికలు, 15 మంది ఇతర రాష్ట్రాల చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. 11 మంది షాపు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలకార్మికులను పాఠశాలల్లో చేర్పించామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెలేర్ కమిటీ సభ్యులు ప్రకాష్, సంగమేశ్వర్, ఎస్ఐ గిరి, లీగల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, కౌన్సిలర్ లక్ష్మణ్, సూపర్‌వైజర్ ఆనంద్, స్వచ్ఛంద సంస్థ నాయకురాలు అంకిత, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు బస్వరాజ్, సంతోష్, మమత, కార్మిక శాఖ అధికారి సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్

సెప్టెంబర్ 4 వరకు కొనసాగనున్న పోటీలు



ఖోఖోలో పోటీపడుతున్న విద్యార్థులు(ఫైల్)


తాండూరు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు పాఠశాలల విద్యార్థులకు పలు క్రీడల్లో జోనల్ లెవల్ ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది. తాండూరు, పెద్దేముల్, కొడంగల్, పరిగి, వికారాబాద్ జోన్ల పరిధిలో ఈ ఎంపిక ఉంటుంది. తాండూరు, బషీరాబాద్, యాలాల మండలాలు తాండూరు జోన్ పరిధిలో ఉండగా, పెద్దేముల్ మండలం మాత్రం వికారాబాద్ జోన్ పరిధిలో ఉంది. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో అండర్ -14, -17 విభాగాల్లో బాలబాలికలు వేర్వేరుగా పోటీ పడనున్నారు. తాండూరు జోన్ పరిధిలో నేటి నుంచి క్రీడాకారుల ఎంపిక బషీరాబాద్‌లో ఉంటుందని జోనల్ సెక్రటరీ జె.అంబదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎంపిక విషయాన్ని అన్ని పాఠశాలలకు సమాచారం ఇచ్చినట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు.

పారదర్శకత పాటించాలి

జోనల్ స్థాయిలో క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతున్నప్పటికీ జిల్లా, ఆపై స్థాయిల్లో కొన్ని అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నైపుణ్యం గల క్రీడాకారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు



దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గురువారం ఉదయం తరగతిలో పాఠాలు చెబుతుండగా పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి పడ్డాయి. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటకు పరుగులు తీశారు. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇబ్బంది పడుతున్నామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 185 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయించాలి గ్రామస్తులు కోరుతున్నారు.

డీడీఎన్ఎస్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సంఘం జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి

కొడంగల్ రూరల్: దూప దీప నైవేద్య అర్చక సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రిస్వామిపై అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కాపురం నారాయణస్వామి ఆరోపించడం సరికాదని డీడీఎన్ఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి అన్నారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జూలై 14, 15, 16వ తేదీలలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చండీ కుబేర పాశుపథ యాగాన్ని దిగ్విజయంగా పూర్తి చేసినట్లు చెప్పారు. దీన్ని జీర్ణించుకోలేని కొందరు అర్చక సమాఖ్య నాయకులు ఏదో విధంగా దూప దీప నైవేద్య అర్చక సంఘంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు.

పెళ్లి పేరుతో మోసం

యువకుడిపై కేసు నమోదు

తాండూరు రూరల్: ఓ యువతిని వివాహం చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కరన్‌కోట్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ నగేశ్ కథనం ప్రకారం.. తాండూరు మండలం బెల్కటూర్ గ్రామానికి చెందిన చాకలి అక్షిత అదే ఊరికి చెందిన చాకలి సురేష్‌లు ఏడేళ్లుగా ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ ఇష్టంలేని తల్లిదండ్రులు కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తితో అక్షితను ఇచ్చి వివాహం చేశారు. పెళ్లయిన నెల రోజులకే అక్షిత భర్తకు ప్రేమికుడు సురేష్ ఫోన్ చేసి ప్రేమ వ్యవహారాన్ని చెప్పాడు. దీంతో ఆమెను భర్త వదిలేశాడు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన సురేష్ ఇప్పుడు పెళ్లికి నిరాకరించాడని, తనకు న్యాయం చేయాలని అక్షిత కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సురేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



నూతన దంపతులు

బషీరాబాద్: కొంత కాలంగా ఒకరినొకరు ప్రేమించుకున్న ఓ జంట పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసన్‌పల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీనివాస్, శాంతమ్మ కొడుకు గౌతం(23) చిన్నప్పటి నుంచి వారి అమ్మమ్మ ఊరైన గండీడ్ మండలం నంచర్లలో చదువుకున్నాడు. అదే గ్రామానికి చెందిన మౌనిక(20)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇంటి నుంచి పారిపోయి గురువారం ఉదయం మాసన్‌పల్లి శివాలయంలో పెళ్లి చేసుకున్నారు. అమ్మాయి బంధువుల నుంచి ప్రాణహాని ఉందని బషీరాబాద్ ఠాణాను ఇరువురూ ఆశ్రయించారు. పోలీసులు ఇరు కుటుంబసభ్యులతో మాట్లాడి సద్దుమణిగించారు.

మహిళపై అత్యాచారయత్నం

కొందుర్గు: మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండంలోని బైరంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగులపల్లి నర్సింలు(35) బుధవారం మధ్యాహ్నం అదే ఊరిలో ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండటంతో ప్రహరీ దూకి వెళ్లాడు. ఇది గమనించిన సదరు మహిళ గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వాళ్లు చేరుకున్నారు. అంతలోనే నర్సింలు తప్పించుకొని పారిపోయాడు. ఈ విషయమై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

ఇందిరమ్మకు ఇసుక గండం

- టోకెన్ అనుమతులు లేవంటున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- ఇల్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన



శివారెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. సీఎం రేంవత్‌రెడ్డి లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని అధికారులను ఆదేశించిన విషయం విధితమే. కానీ దోమ మండల అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ఇసుక పర్మిషన్ కోసం టోకెన్ ఇవ్వాలని తహసీల్దార్ వద్దకు వెళితే.. అనుమతి లేదంటూ తిప్పిపంపిస్తున్న సందర్భాలు నెలకొంటున్నాయి. దీంతో లబ్ధిదారులకు ఇసుక దొరకక ఇళ్లు కట్టుకోలేని పరిస్థితులు దాపురిస్తున్నాయి. అధికారులు మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నారు. ఈ ఊరికి మొత్తం 185 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా అందులో 96 ఇళ్ల పనులు జరుగుతుండగా 89 ఇండ్లు ప్రారంభానికి నోచుకోలేకపోయాయి. దీంతో పనులు చేసుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక సమస్య తలనొప్పిగా మారింది.

కాసులు దండుకుంటున్న దళారులు

మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైనంత ఇసుక దొరుకుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. దిర్సంపల్లి, మైలారం, గొడుగోనిపల్లి వాగులతో పాటు కాకారవాణి ప్రాజెక్టులో భారీ స్థాయిలో ఇసుక ఉంది. దాన్ని కొంత మంది వ్యాపారులు ట్రాక్టర్లలో పొలాల దగ్గరకు తెచ్చుకొని డంపులుగా ఏర్పాటు చేసుకున్నారు. ఆ డంపులను అధికారులు పట్టుకోకపోవడం, అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారు ఇష్టారీతిన అధిక రేట్లకు విక్రయిస్తూ కాసులు దండుకుంటున్నారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికి రూ.5 లక్షలు కేటాయిస్తుంది. దీంట్లో స్టీల్, సిమెంట్, ఇటుకలు తెచ్చుకోవాల్సి ఉంది. వాటి ధరలు సైతం అధికంగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చి ఇందిరమ్మ ఇళ్లకు అందించాలని అధికారులను ఆదేశించింది. కానీ అధికారులు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

డస్ట్‌తో కట్టుకుంటున్నాం



ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. పకడ్బందీగా నిర్మించుకుందామనుకుంటే ఇసుక దొరకలేని పరిస్థితి నెలకొంది. దీంతో డస్ట్‌తో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక అందించాలని కోరితే అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

– బాలునాయక్, శివారెడ్డిపల్లితండా

ఎలాంటి ఆదేశాలు లేవు



ఇందిరమ్మ ఇళ్లయినా, మరే ఇతర అవసరాలకైనా ఇసుక పర్మిషన్ ఇచ్చేందుకు తమకు ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను తెచ్చుకునేందుకు టోకన్‌లను అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– గోవిందమ్మ, తహసీల్దార్, దోమ

సేవలే చిరస్థాయిగా ఉంటాయి

జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



ఎస్ఐ సన్మాన కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే చిరస్థాయిగా ఉంటాయని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఎస్ఐగా సేవలందించి, పదవీ విరమణ పొందిన ఎండీ శయిదుద్దీన్‌కు గురువారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ఎండీ శయిదుద్దీన్‌ను సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘ సేవలను, అంకితభావాన్ని క్రమశిక్షణను కొనియాడారు. 38 ఏళ్లకు పైగా ఎలాంటి రిమార్క్ లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. పోలీస్ ఉద్యోగం సవాలుతో కూడుకున్నదని, కుటుంబ సభ్యుల సహకారం లేనిదే ఇంత సుదీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేయడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మురళీధర్, ఏఓ జ్యోతిర్మయి, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి వక్రబుద్ధి

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- గతంలో కేసు నమోదైనా తీరుమారని వైనం

మొయినాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్న ఓ వ్యక్తి తన వక్రబుద్ధితో ఆ వృత్తికే చెడ్డ పేరు తెస్తున్నాడు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఇతనిపై గతంలో కేసు నమోదైనా 'కుక్క తోక వంకర' అనే చందంగా మార్పు మాత్రం రాలేదు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిత్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ బుధవారం ఓ పదో తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పరుష పదజాలంతో తిట్టాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన బాలిక ఈ విషయాన్ని తండ్రికి చెప్పింది. గురువారం స్కూల్‌కు వచ్చిన ఆయన ఉపాధ్యాయుడిని నిలదీయగా అతన్ని సైతం తీవ్రంగా దూషించడంతో పాటు చెప్పుతో దాడికి ప్రయత్నించాడు. తోటి ఉపాధ్యాయులు వద్దని వారించినా పట్టించుకోలేదు. దీంతో కంగుతిన్న బాలిక తండ్రి హెచ్ఎంకు ఫోన్ చేయగా.. తాను సెలవులో ఉన్నానని సోమవారం వచ్చి మాట్లాడుతానని చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం ఇదే పాఠశాలలోని మరో విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవరించిన ప్రవీణ్‌కుమార్‌పై అప్పట్లో షీటీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు, కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కోర్టులో హాజరు పర్చగా.. తీవ్రంగా మందలించిన న్యాయస్థానం జరిమానా విధించింది. అయినప్పటికీ అతని ప్రవర్తన మారలేదని, ఈ విషయమై డీఈఓకు లేఖ రాశామని పలువురు తల్లిదండ్రులు తెలిపారు. ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూతురి పెళ్లికి దాచితే.. దోచేశారు!

మామిడిపల్లిలో భారీ చోరీ

- రూ.15 లక్షల నగదు, 16 తులాల బంగారం అపహరణ



పోలీస్ స్టేషన్ ఆవరణలో బాధితులు

నందిగామ: కూతురి పెళ్లి కోసం దాచిన నగదు, బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని మండలంలోని మామిడిపల్లికి చెందిన వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులను ఆశ్రయించినా స్పందన కరువైందని లబోదిబోమన్నాడు. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి కృష్ణయ్య కొందుర్గు మండలంలోని మహదేవ్‌పూర్‌లో ఉన్న భూమిని గతంలో విక్రయించాడు. వచ్చిన డబ్బులతో కొంత అవసరాల కోసం వాడుకున్నాడు. కూతురుకు పెళ్లి చేయాలనే ఉద్దేశంతో 16 తులాల బంగారాన్ని కొనుగోలు చేసి, రూ.15 లక్షల నగదును ఇంట్లో భద్రపరిచాడు. ఇటీవల రుణం చెల్లించాలని బ్యాంకు నుంచి ఫోన్ రావడంతో ఇంట్లో చూడగా నగదు, బంగారం కనబడకపోవడంతో లబోదిబోమన్నాడు. డబ్బులు, పసిడి దోచుకుపోయిన విషయమై కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో చర్చించాడు. ఎక్కడ నుంచి కనీస సమాచారం లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు విచారణ చేశారు. గురువారం తిరిగి బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇంట్లో సజ్జపై దాచిన డబ్బులను తెలిసిన వారే దోచుకుపోవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేసు నమోదు చేయని పోలీసులు

మామిడిపల్లిలో ఇంత పెద్ద చోరీ జరిగినా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. బాధితులను విచారించామని, ఏసీపీ శుక్రవారం వస్తారని, మరోసారి విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పారిపోయిన విద్యార్థి అప్పగింత



బాలుడిని కుటుంబీకులకు అప్పజెప్పుతున్న ఉపాధ్యాయులు, పోలీసులు

కుల్కచర్ల: చదవడం ఇష్టం లేక పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామానికి చెందిన గుడిసె అఖిల్ ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ స్థానికంగా బీసీ వసతిగృహంలో ఉంటున్నాడు. బుధవారం అతడు పాఠశాల సమయంలో బయటకు వచ్చి కుల్కచర్లకు వచ్చి బస్సులో షాద్‌నగర్ వెళ్లాడు. అక్కడ పోలీసులు బాలుడిని గమనించి వివరాలు అడిగారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అతడి చిరునామా తెలుసుకుని స్థానికుల ద్వారా కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. గురువారం ఉదయం ఎంఈఓ హబీబ్ అహ్మద్ సమక్షంలో అఖిల్‌ను కుటుంబీకులకు అప్పజెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీష్, వసతిగృహ ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

దోమ: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటన దోమ మండల పరిధిలోని బాస్‌పల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హరిశ్వర్‌రెడ్డి తన బైక్‌పై బొంపల్లికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో బాస్‌పల్లి ప్రాథమిక పాఠశాల వద్ద మహబూబ్‌నగర్ నుంచి పరిగి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆయనను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

మద్యం సేవిస్తూ కుప్పకూలి వ్యక్తి మృతి

శంషాబాద్: కవేలిగూడలోని ఓ వైన్స్‌లో మద్యం సేవిస్తున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి మరణించిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరు మండలం అక్కినేని గూడ గ్రామానికి చెందిన సోలిపురం సాయిలు(48) కవేలి గూడ వైన్స్‌లోని వెనుక భాగంలో ఉన్న సిట్టింగ్ ఏరియాలో కూర్చుని మద్యం సేవిస్తూ ఒక్కసారిగా వెనక్కిపడిపోయాడు. పక్కనే ఉన్న కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికొచ్చి పరిశీలించగా అప్పటికే ఆయన మరణించాడు. ఈ మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి వచ్చిన మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కల్తీ మద్యం కారణంగా సాయిలు మృతి చెందాడని ఆరోపిస్తున్నారు.

రహదారులను బాగుచేయాలని వినతి

శంషాబాద్: పట్టణంలోని సహస్ర శ్రీనివాసా కాలనీలో రహదారులు అధ్వానంగా మారాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ మొత్తం మట్టిరోడ్లే ఉండటంతో వర్షాలకు గోతులమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొంతకాలంగా మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా చర్యలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సహస్ర శ్రీనివాసా కాలనీలో రహదారుల దుస్థితిలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రహదారులకు మరమ్మతులు చేయాలని, లేదంటే సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ నాయకులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన బస్టాండ్

వామ్మో.. ఇదేం బస్టాండ్!

ఆవరణ మొత్తం చెత్తమయం

- ప్రయాణికులు కూర్చోలేని పరిస్థితి
- నిర్వహణను గాలికొదిలేసిన ఆర్టీసీ అధికారులు

ధారూరు: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ధారూరు బస్టాండ్ దారుణంగా తయారైంది. మేకలు, పందులు, కుక్కలు మలమూత్ర విసర్జన చేయడంతో ప్రయాణికులు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ఆవరణ మొత్తం కంపు కొడుతోంది. తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ దీని పర్యవేక్షణ బాధ్యతలు తీసుకున్నా ఒక్కసారి కూడా పరిశీలించిన పాపానపోలేదనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ధారూరుకు వస్తుంటారు. బస్టాండ్‌లో చెత్తాచెదారం వల్ల ఒక్క నిమిషం పాటు కూడా ఉండలేక పోతున్నారు. వర్షాల కారణంగా ఆవరణ మొత్తం చిత్తడిగా మారింది. అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితిలో ఉంది. బస్సులు సైతం బస్టాండులోకి రావడం లేదని ప్రయాణికులు తెలిపారు. రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, బస్సులు బస్టాండ్ లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మూగజీవాల మలమూత్ర విసర్జన చేయడంతో అపరిశుభ్రంగా మారిన ధారూరు బస్టాండ్

పన్నెండేళ్లకు పచ్చజెండా!



బేగంపేట్‌లో తప్పనున్న ట్రాఫిక్ చిక్కులు

- త్వరలో పాటిగడ్డ–నెక్లెస్ రోడ్డు ఆర్ఓబీ పనులు
- పుష్కర కాలం నాటి ప్రతిపాదనలకు మోక్షం
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: పుష్కరకాలం నాటి ప్రతిపాదనలు తిరిగి పట్టాలెక్కనున్నాయి. హైదరాబాద్– సికింద్రాబాద్‌లను కలిపే బేగంపేట్ రోడ్–రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ మార్గానికి ప్రత్యామ్నాయంగా ఎస్పీ రోడ్ –నెక్లెస్ రోడ్‌ను కలుపుతూ పాటిగడ్డ మీదుగా ఆర్ఓబీ (ఫ్లై ఓవర్) ప్రాధాన్యతతో నిర్మించేందుకు జీహెచ్ఎంసీ, దక్షిణమధ్య రైల్వే అంగీకారానికి వచ్చాయి. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 80 కోట్లు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు.

సమన్వయం, సహకారం లోపంతో..

- ఇక్కడి ఆర్ఓబీ ప్రతిపాదన ఈనాటిది కాదు. నగరంలో మెట్రో రైలు పనులు ప్రారంభం కావడాని కంటే ఎంతోకాలం ముందే ఈ ప్రతిపాదన ఉన్నప్పటికీ, ఆయా ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, సహకార లోపంతో కాగితాలు దాటి పనులు మొదలు కాలేదు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బేగంపేట వైపు నుంచి ఖైరతాబాద్, సెక్రటేరియట్‌ల వైపు వచ్చే వారికి ఎంతో సమయం ఆదా అవుతుంది. సెక్రటేరియట్– ట్యాంక్‌బండ్– ప్యారడైజ్‌కు ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుంది. అప్పటి అంచనా వ్యయం రూ.25 కోట్లు ప్రస్తుతం రూ. 80 కోట్లయింది.
- ఈ ఫ్లైఓవర్ పనులు పూర్తయితే అటు ఎస్పీ రోడ్, ఇటు ఎంజీ రోడ్‌లోనూ ట్రాఫిక్‌కు ఎంతో ఉపశమనం కలుగుతుంది. అప్పట్లోనే రైల్వే శాఖ నుంచి అనుమతులున్నా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దాదాపు 7.5 మీటర్లుండే ఫ్లై ఓవర్‌పై రెండు వైపులా క్యారేజ్‌వేలతో పాటు ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్‌లు గత ప్రతిపాదనల్లో ఉన్నాయి. అవసరమైతే మార్పు చేర్పులు చేయనున్నారు.

ఫ్లైఓవర్ ఫ్లాష్‌బ్యాక్ ఇలా..

2009లో ఉమ్మా సమావేశంలో ఈ ప్రాజెక్టు కయ్యే వ్యయాన్ని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ చెరిసగం భరించాలని, పనులు హెచ్ఎండీఏ చేయాలని నిర్ణయించారు. జీహెచ్ఎంసీ ఇవ్వాల్సిన నిధులు జీహెచ్ఎంసీ ఇవ్వలేదు. హెచ్ఎండీఏ సైతం నిధులివ్వలేమని, ప్రాజెక్టు పని చేయలేమని, పనుల్ని జీహెచ్ఎంసీకి బదలాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరింది. అనంతరం మెగాసిటీ ప్రాజెక్ట్ కింద చేపట్టాలనుకున్నారు. ఏదీ కాలేదు. బేగంపేట, ఎంజీ రోడ్ మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ, రైల్వే అధికారుల సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఫ్లై ఓవర్ పనులు పూర్తయితే అటు బేగంపేట, ఇటుఎంజీ రోడ్లలో రద్దీ తగ్గనున్నందున మెహిదీపట్నం– సికింద్రాబాద్ రాకపోకల సమయం సైతం తగ్గనుందని అధికారులు పేర్కొన్నారు.

చెరవీడని సర్కారు భూమి!

- కబ్జాకు గురైనట్లు తేల్చినా స్వాధీనం చేసుకోని వైనం
- ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణం, బిగించిన ట్రాన్స్‌ఫార్మర్

బషీరాబాద్: ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి విడిపించాల్సిన అధికారులు చేతులెత్తేశారు. బషీరాబాద్– తాండూరు ప్రధాన రోడ్డుకు ఆనుకుని కాశీంపూర్ శివారులోని విలువైన సర్కారు భూమి అన్యాక్రాంతానికి గురైందని తేల్చినా స్వాధీనం చేసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. బషీరాబాద్, యాలాల, తాండూరు మూడు మండలాలను కలిపే శివారు కావడంతో కొన్నాళ్లు ఈ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. సమీప రైతులు ఇటీవల ఆందోళన వ్యక్తంచేయడం, పత్రికల్లో ఇందుకు సంబంధించిన కథనాలు రావడంతో స్పందించిన యంత్రాంగం గత నెల జూలై 10న సర్వేచేసింది. జుంటివాగు బ్యాక్‌వాటర్ నిలిచే నది ప్రాంతాన్ని మట్టితో పూడ్చేసిన అక్రమార్కులు 200 మీటర్ల పొడవున, ఐదు మీటర్ల మేర భూమిని కబ్జా చేసినట్లు తేల్చారు. దీనికి తోడు తాండూరు మండలం మాచనూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 32/2లో సుమారు 20 గుంటల భూమి అన్యాక్రాంతమైనట్లు నిర్ధారించారు. అనంతరం యాలాల, తాండూరు రెవెన్యూ అధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులు మరోసారి సంయుక్తంగా సర్వే చేశారు. కబ్జా వాస్తవమేనని తేల్చినప్పటికీ సర్కారు భూమిని మాత్రం చెర నుంచి విడిపించలేదు. ఇదిలా ఉండగా భూమిని చెరబట్టిన వ్యక్తులు ఇటీవల ప్రభుత్వ స్థలంలోనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీనికితోడు బషీరాబాద్– తాండూరు ప్రధాన రోడ్డు నుంచి వీరి పొలాల్లోకి వెళ్లేందుకు ప్రభుత్వ భూమిని వారి సొంత స్థలంలా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కుల ఆట కట్టించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తప్పవు..

ఈవిషయమై యాలాల తహసీల్దార్ వెంకటస్వామిని వివరణ కోరగా.. జుంటివాగు కబ్జాపై ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి సమగ్రంగా సర్వే చేశామన్నారు. తాండూరు మండల పరిధిలో 5 మీటర్ల మేర భూమి కబ్జాకు గురైనట్లు తేలిందని చెప్పారు. యాలాల పరిధిలోకి వచ్చే చెక్‌డ్యాం వెనకవైపున 200 మీటర్ల పొడవునా ఆక్రమించారని తెలిపారు. ఇక్కడ నిర్మిస్తున్న గది తాండూరు పరిధిలోకి వస్తుందన్నారు. ఆక్రమణకు గురైన స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేయడంతో పాటు భూమిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టంచేశారు. మరోవైపు ఇరిగేషన్ డీఈ కిష్టయ్య మాట్లాడుతూ.. జుంటివాగు కబ్జాపై ఇప్పటికే కలెక్టర్‌కు నివేదిక ఇచ్చామన్నారు. కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.